# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 29-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- భిన్నత్వంలో ఏకత్వ దృశ్యం మహా కుంభమేళాలో కనపడుతుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- దేశ భద్రత విషయంలో శత్రువుల కార్యకలాపాలపై నిఘా అవసరమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.
- వినోద పరిశ్రమకు భారతదేశాన్ని ప్రధాన కేంద్రంగా మార్చడంలో వేవ్స్ సమావేశం ప్రముఖ పాత్ర పోషిస్తుందని నరేంద్రమోదీ వెల్లడించారు.
- "పీఎం కుసుం" పథకంతో రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.
- ఇస్రో రేపు ప్రయోగించనున్న పీఎస్ఎల్‌వీ సీ-60 రాకెట్ కౌంట్‌డౌన్ ఈ రోజు రాత్రి 8 గంటల 58 నిమిసాలకు ప్రారంభకానుంది.

========================

భిన్నత్వంలో ఏకత్వ దృశ్యం మహా కుంభమేళాలో కనపడుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. మన్ కీ బాత్ మనసులోని మాట 117వ సంచికలో ఈరోజు ప్రధానమంత్రి తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకున్నారు. వచ్చే సంవత్సరం జనవరి 13వ తేదీన ప్రయాగ్ రాజ్‌లో ప్రారంభం కానున్న మహా కుంభమేళాలో కృత్రిమ మేధా చాట్ బోట్ వంటి అధునాత సాంకేతికను వినియోగిస్తున్నామని తెలిపారు. మహా కుంభ మేళాకు వచ్చే యాత్రికులు ఈ సాంకేతిక సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానమంత్రి పిలుపునిస్తూ....

(వాయిస్ 40 సెకన్లు)

భారతీయ వినోధ పరిశ్రమ గొప్పదాన్ని గురించి కూడా నరేంద్రమోదీ ప్రస్తావించారు. వచ్చే సంవత్సరం దేశంలో తొలి సారిగా నిర్వహించబోతున్న ప్రపంచ దృశ్య శ్రవణ వినోద శిఖరాగ్ర సమావేశం (waves) గురించి మాట్లాడుతూ... మీడియా, వినోద పరిశ్రమకు చెందిన జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొనే ఈ సమావేశంలో ఆయా రంగాలకు

చెందిన నిపుణులు పాల్గొనాలని కోరారు. వినోద పరిశ్రమకు భారతదేశాన్ని ప్రధాన కేంద్రంగా మార్చడంలో వేవ్స్ సమావేశం ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

=========================

ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా 81 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలను కేంద్ర ప్రభుత్వం అందజేస్తోందని పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. రైతుల కోసం చేపట్టిన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టును పర్యవేక్షించేందుకు త్రిపురలోని సెపాహిజాలా జిల్లాలోని చరిలం గ్రామాన్ని ఈ రోజు సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... "పీఎం కుసుం పథకం" వంటి పలు సంక్షేమ పథకాలతో పంటల దిగుబడి రెట్టింపు అయి రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. "గరీబ్ కళ్యాణ్ అన్న యోజన" పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు బియ్యం, గోధుమలు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు.

=========================

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ISRO) రేపు ప్రయోగించనున్న పీఎస్ఎల్వీ సీ-60 రాకెట్ కౌంట్‌డౌన్ ప్రారంభానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సూళ్లురుపేట షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి రేపు రాత్రి 9 గంటల 58 నిమిషాలకు రాకెట్‌ను నింగిలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ రాకెట్ ప్రయోగానికి ఈరోజు రాత్రి 8 గంటల 58 నిమిసాలకు కౌంట్‌డౌన్ ప్రారంభానికి ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ షార్‌కు చేరుకున్నారు. పీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 62వ ప్రయోగం కాగా పీఎస్ఎల్వీ కోర్ ఎలోన్ దశతో చేసే 18వ ప్రయోగమిది. ఈ రాకెట్ 320 టన్నుల బరువు, 44.5 మీటర్ల ఎత్తు ఉందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. ఇస్రో రూపొందించిన స్పాడెక్స్ అనే జంట ఉపగ్రహాలు ఈ ప్రయోగంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని, వీటికి ఛేజర్, టార్గెట్ అనే పేర్లను పెట్టామని అన్నారు. ఈ ఉపగ్రహాలు స్పేస్ డాకింగ్, ఫార్మేషన్ ఫ్లయింగ్, మానవ అంతరిక్షయానం వంటి సేవలకు ఉపయోగపడతాయని స్పష్టం చేశారు.

విరామం

=========================

శత్రువుల కదలికలపై దృష్టి పెట్టాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైన్యానికి సూచించారు. మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్ జిల్లాలోని మావ్ కంటోన్మెంట్ వద్ద మాట్లాడుతూ... "దేశ భద్రత విషయంలో శత్రువులు కార్యకలాపాలపై మరింత నిఘా అవసరమని, వారి కదలికలను గమనిస్తూనే ఉండాలని ఆర్మీ సిబ్బందికి సూచించారు. భారత్ అభివృద్ధి ప్రయాణంలో సైన్యం పాత్ర కీలకమని, వారు తీసుకుంటున్న కఠినమైన శిక్షణతో పాటు అంకిత భావం, దేశం పట్ల బాధ్యతాయుతంగా మెలగడం స్ఫూర్తిదాయకమని అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

=========================

భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75 సంవత్సరాలు పూర్తి కానున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఓ వినూత్న ప్రచార కార్యక్రమం చేపట్టింది. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకొని.. రాజ్యాంగ నిర్మాతల దూరదృష్టిని, రాజ్యంగ రూపకల్పనలో వారు చేసిన విశేష కృషిని ప్రజలకు.. ముఖ్యంగా యువతకు తెలియజేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించింది. రాజ్యాంగం పీఠికను చదివి.. ఆ వీడియోను రికార్డు చేసి ఈ వెబ్‌సైట్‌లో షేర్ చేయడం ద్వారా ఓ సర్టిఫికెట్‌ను పొందొచ్చు. ఈ క్యాంపెయిన్‌లో భాగస్వాములయ్యేందుకు.. constitution75.com వెబ్‌సైట్‌ను సందర్శించాల్సి ఉంటుంది.

=========================

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (UGC-NET) డిసెంబర్ 2024 పరీక్ష అడ్మిట్ కార్డులు ఈరోజు విడుదలయ్యాయి. మొత్తం 85 సబ్జెక్టులకు జనవరి 3 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో (సీబీటీ) జరిగే ఈ పరీక్షల అడ్మిట్ కార్డులను ఎన్టీఏ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ, సెక్యూరిటీ పిన్ ను నమోదు చేసి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది.

==========================

ఉత్తర భారతదేశంలో ఈరోజు నుండి చలిగాలుల పరిస్థితులపై భారత వాతావరణ శాఖ, (IMD) హెచ్చరికలు జారీ చేసింది. రానున్న రెండు రోజుల్లో వాయువ్య భారతదేశంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 3 నుండి 5 డిగ్రీల సెల్సియస్ తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. జమ్మూ, కాశ్మీర్, లడఖ్‌లోని అనేక ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సున్నా డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉన్నాయని తెలిపింది. పశ్చిమ, మధ్య భారతదేశం మీదుగా, రాబోయే 24 గంటల్లో కనిష్ట ఉష్ణోగ్రతలలో గణనీయమైన మార్పు ఉండవని, తదుపరి మూడు రోజులలో కనిష్ట ఉష్ణోగ్రతలు 3 నుండి 5 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉందని ఆ శాఖ పేర్కొంది.

==========================

దక్షిణ కొరియాలో ముయాన్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై ల్యాండింగ్ సమయంలో విమానం అదుపు తప్పి రక్షణగోడను ఢీకొట్టింది. దీంతో భారీగా మంటలు చెలరేగాయి విమానం పేలిపోయింది. ఇప్పటి వరకు 179 మంది మృతి చెందినట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో 181 మంది ఉన్నారు. వీరిలో 175 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది. బ్యాంకాక్ నుంచి ముయాన్‌కు వస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంపై అధికారులు స్పందిస్తూ... విమానం అప్పటికే ల్యాండింగ్‌కు ప్రయత్నించి విఫలమైందని పేర్కొన్నారు. ఇది నేలపైకి దిగిన అనంతర రన్‌వే చివరికి వస్తున్న సమయంలో కూడా వేగాన్ని నియంత్రించుకోవడంలో విఫలమైనట్లు చెప్పారు. ఇది ఎయిర్ పోర్టు గోడను ఢీకొనడంతో విమానంలో ఇంధనం ఒక్కసారిగా మండిపోయి మంటలు వ్యాపించినట్లు అధికారులు తెలియజేశారు.

==========================

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈరోజు రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. వచ్చే నెలలో ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న మహా కుంభ మేళాకు హాజరు కావాలని రాష్ట్రపతిని ఆయన ఆహ్వానించారు. మహా కుంభ్ మేళా జనవరి 13న ప్రారంభమై ఫిబ్రవరి 26వ తేదీ వరకు కొనసాగుతుంది.

==========================

2024 ఫిడే మహిళల ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్న కోనేరు హంపీని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈరోజు సామాజిక మాధ్యమం వేదికగా అభినందించారు. చెస్ గ్రాండ్ మాస్టర్ అద్భుతమైన విజయాన్ని ప్రశంసించారు. ఈ ఘనత సాధించిన ఏకైక భారతీయురాలిగా లక్షలాది మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కొనియాడారు.

==========================

మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియా- భారత్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగవ క్రికెట్ టెస్టులో నాలుగవ రోజు అయిన ఈరోజు ఆట ముగిసే సమయానికి రెండవ ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 9 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. దీంతో 333 పరుగుల ఆదిక్యంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 474 పరుగులు చేయగా.. భారత్ 369 పరుగులు చేసింది. రేపు చివరి రోజు ఆట అర గంట ముందే ప్రారంభం కానుంది.

==========================

==========================